# అనుబంధం

నాలుగురోడ్లు కలిసేచోటుని "చౌరస్తా" అంటారు. హైదరాబాదులో సాధారణంగా చౌరస్తాలమధ్య పూలమొక్కల్ని పెంచుతారు. యాంత్రికయుగపు నాగరికత చిహ్నమయిన తారురోడ్డుమధ్య, ఆ అందమయిన ఆకుపచ్చదనం – నియంతహృదయంలో కృపారసంవలె – వింతగా, ముచ్చటగా వుంటుంది. అలాటి చౌరస్తా ఒకటి హిమయత్‌నగర్ నడిబొడ్డుమీద వుంది. అక్కడ – ఒక పెట్రోలుబంకూ, రెండు హోటళ్ళూ, నాలుగు బట్టలంగళ్ళూ, "గ్లోబ్ హేర్‌కటింగ్" సెలూన్, పిండిమరా వున్నాయి ఎంతో హడావిడిగా వుంటుంది ఆ చోటు. ఆ చౌరస్తానుండి ఒకదారి బర్కత్‌పురాకు దారి తీస్తుంది. ఇంకకొకటి టాంక్‌బండ్ వైపు పోతుంది. మిగతా రెండురస్తాలూ అశోక్‌నగర్‌కూ, బషీర్‌బాగ్‌కూ వెళ్తాయి.

సరిగ్గా ఆ కూడలివద్ద...."వస్తా బాబూ....వస్తా"అని నరసింహం దగ్గర శెలవుతీసుకున్నాడు ముత్యాలు. మాసినగుడ్డలో మూటకట్టిన అన్నం గిన్నెను చేత్తోపట్టుకుని నెమ్మదిగా నడిచిపోతున్న ముత్యాలు కనుమరుగయేదాకచూస్తూ నిల్చున్నాడు నరసింహం. టాంక్‌బండ్‌వైపుగా ముత్యాలు వేస్తున్న ఒక్కొక్క-అడుగూ బరువుగా వుందనిపించింది.

ఆఫీసు అనే యంత్రంలో–నువ్వు చక్రానివి నేను మరని. నువ్వు మేకువి నేను సుత్తిని–అనే తప్ప, కొంతదగ్గర కొచ్చేదాక–ఎవ్వడూ అవతలివాడిని మనిషిగా ఎరగరుకదః ప్రతిజీవితమూ ఒక అనుభవాలపుట్ట. కదలిస్తే అందులోంచి మొగలిపువ్వుల పరిమళం రావచ్చు; పడగవిప్పిన పన్నగమూ రావచ్చు....అనుకున్నాడు నరసింహం.

'గుంయ్' మన్న హారన్‌మోత విని ఉలిక్కిపడి కాలిబాటమీద కెగిరి–తనఇంటివైపు తిరిగి, బర్కత్‌పురా రోడ్డుమీద నడవసాగాడు.

దీపాలు వెలిగాయి. అందమయిన ఆడవాళ్ళు అందమయిన దుకాణాల్లోనిల్చొని అందంగా మెరుస్తున్నారు. ఆశలు ఆశలుగానే నిలిచిపోయే కొన్ని జీవితాల హీరోలు, బయటనిల్చునే ఆ దుకాణాలనూ, ఆడవాళ్ళవీ చూస్తున్నారు. చూస్తూ పోతున్నారు. పోతూ చూస్తున్నారు.

నరసింహమూ నడుస్తున్నాడు.

పొద్దున్న అది జరిగినప్పటినుండి నరసింహంలో పదివేల ఆలోచనలు పడగలెత్తాయి. జీవితపు అగాధమూ, జీవితపు ఔన్నత్యమూ–అతడి ముందు వెనకల నిల్చున్నట్లయింది. అందరి జీవితాలు తనవే అన్పించిందొక్కక్షణం.... మరుక్షణమే తాను ఒంటరిగా చీకటిలో నిల్చున్నట్లన్పించింది.

జరిగిందేమిటంటే?

–అవేళ పొద్దున ఆఫీసులో పెద్దదొరగారు.... నరసింహాన్ని పిలిచారు అందరినుండీ రక్షణనిధికి స్వచ్ఛందంగా చందాలు వసూలు చేసే బాధ్యత అతడి కప్పగించారు.

ఆ బాధ్యత నిర్వహించడం ఆరంభించిన నరసింహానికి చాల విచిత్రమయిన అనుభవాలు కలిగాయి. అన్నిటికన్నా అపురూపమయిన విషయం ప్యూను ముత్యాలు. అతడిజీతం నెలకుఅరవై. నరసింహం చేతికి పదిరూపాయలిచ్చాడు. రక్షణనిధికి అంతకన్న ఎక్కువ ఇవ్వలేకపోతున్నందుకు బాధపడ్డాడు! అక్కౌంటెంట్లు, క్లర్కులూ వగైరా రెండు రూపాయలు ఇవ్వడానికే మీనమేషాలు లెక్కపెడుతుండగా – ప్యూను ముత్యాలేమిటీ, పదిరూపాయ లివ్వడమేమిటీ, అని విస్తుపోయాడు నరసింహం.

రెండు మూడు గంటల తర్వాత – ఆఫీసు కాంపౌండులో బీడీ తాగుతూ కనుపించాడు ముత్యాలు. నరసింహాన్ని చూడగానే బీడీని వెనక్కా దాచాడు.

"ఫరవాలేదు ముత్యాలు.... నువ్వు బీడీ తాగు—" అన్నాడు నరసింహం. ముత్యాలు నవ్వాడు. నల్లటి అతడి మొహంమీద ఆ నవ్వు వెన్నెలకిరణంలా వుంది హఠాత్తుగా, ఎందుకో మరి, నరసింహం నోటి నుండి ఆ ప్రశ్నవచ్చింది.

"మరయితే ముత్యాలూ–నీకు కొడుకులెవ్వరూ లేరా?"

వెన్నులో కత్తిగుచ్చినా ముత్యాలు మొహం అలాకాదేమో, అతడి యాభైయేళ్ళూ ఒక్కసారి ఏడ్చినట్లనిపించింది. ముత్యాలు కళ్ళల్లో నిప్పు మెరసి మాయమయింది. అతడి పెదవులు అల్లనల్ల వాడాయి. "లేదు.... నాకు కొడుకు.... లేడు" అని అరిచి బీడీ పక్కదే విసిరికొట్టి పారేసి, గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

చెప్పిన పనికి చిరునవ్వుతోచేస్తూ ముభావంగా వుండే ముత్యాలేనా ఇతడు? స్థంభించిపోయాడు నరసింహం. ఎలాటి జ్ఞాపకాల నరస్సులోకి రాయి విసిరాడు తను? ఎటువంటి అనుభవాలపుట్టలోకి పొగ ఊదాడు తను?

ఏమో?

సాయంకాలం ఆఫీసయింతర్వాత క్లబ్బులోకూర్చుని కాసేపు పత్రికలు తిరగేసి, నెమ్మదిగా తను ఇంటికని బయలుదేరి వీధిలో అడుగు పెట్టేసరికి "సార్!" అంటూ వచ్చాడు ముత్యాలు.

ఇందాకటి పొరపు విడిపోతుంది కాబోలునని ఆశతో ఎదురు చూశాడు తను.

అక్కడినుండి తనతోబాటు ఫర్లాంగుదూరం నడిచిన ముత్యాలు చెప్పిందల్లా— "ఇందాక ఏదో అరిచాను....మన్నించండి సార్!" అని మాత్రమే....

—అని నెమరువేసుకుంటూ ఆంధ్రయువతీమండలిదగ్గర, కుడివైపు తిరిగాడు నరసింహం. శ్రీరాములవారి బాణంలా దూసుకుపోయిందొక అధునాతన యువతిలాంటికారు. కొందరి భార్యలవద్ద వారిభర్తల్లా–భయభక్తులతో ఒదిగి, కాలిబాటమీదుగా నడవసాగాడు నరసింహం.

అయినా, ముత్యాలు జీవితంలోకి తొంగిచూడాలన్న కాంక్ష తనకు దేనికి—అని మందలించుకున్నాడు నరసింహం.

అతడి జీవితం ఏదయితేనేంగాక రక్షణనిధి విషయంలో ముత్యాలు ఆదర్శప్రాయంగా వ్యవహరించాడు.

దేశమంటే మట్టికాదనీ, మనుష్యులనీ చదువుకున్న వాళ్ళందరూ బల్లలు గుద్దుతుంటారు. కాని దేశమంటే ఎలాటి మనుష్యులు? స్వేచ్ఛ వున్న మనుష్యులు....అవును.

స్వేచ్ఛగల మనుష్యులున్నది దేశం.

కానిదది పంజరం.

అలాటి స్వేచ్ఛ ఖరీదెంత?

అది ముత్యాలుకు తెలుసు. అతడిలాటివారు కొందరికి తెలుసు. అలాటివాడే ఒక ముసలిదుకాణదారుడెవడో–ఢిల్లీలో రాష్ట్రపతిదగ్గరికి వెళ్ళి తన జీవితమంతా శ్రమించి సేకరించిన రెండువేలరూపాయలనూ అందజేశాడట!

ఆ వార్త చదివితేనే ఒళ్ళు పులకరించింది.

అదృశ్యంగా, అజ్ఞాతంగావుండిన అమ్మ—మనం మరిచిపోయిన తల్లి–ఆపదలోవుండి కేకవేయగా, విని ప్రాణాలొడ్డడానికి పరుగెత్తిన

బిడ్డల ప్రేమ అది. స్వర్గానికన్నా పూజ్యనీయమయిన మాతృదేశానికీ, మనుష్యులకూ మధ్యవున్న అనుబంధం అది.

నరసింహానికి దీపాలన్నీ మసకగా కనుపించాయి. జేబులోనుండి రుమాలు తీసుకున్నాడు అతడు.... ఒక హోటలువద్ద జనం గుమిగూడి నిల్చున్నారు. జాగృతమయిన జాతి, రేడియోవార్తలు వింటున్నది; మంచికి మంచికానిదానికి మధ్య సరిహద్దులో చెలరేగుతున్న సంఘర్షణ గురించి తెలుసుకుంటున్నది.

నరసింహమూ నిలుచున్నాడు.

* * *

ముత్యాలు టాంక్‌బండ్ దాటి సెక్రెటేరియట్ సమీపించాడు – 'ఏమనుకున్నాడో ఆయన' అని మళ్ళీ అనుకున్నాడు ముత్యాలు. క్లర్కు– 'నరసింహం మంచివాడే....అయినా తనసోదినంతా ఎట్లా చెప్పడం–'

లక్‌డీ కా–పూల్ మలుపుదగ్గర ఒక బంగళాలోనుండి పెద్ద మామిడి చెట్టు వీధిలోకి తొంగిచూస్తున్నది. గుత్తులు గుత్తులు పువ్వులతో, మామిడి పళ్ళతో కలకలలాడుతూంది ఆ చెట్టు. దానిని చూచి నిట్టూర్చాడు ముత్యాలు. ఒకప్పుడు తన జీవితమూ అలా నిండుగావుండేది అనుకుంటూ ఖైరతాబాద్ వైపు అడుగులు వేయసాగాడు. బస్సుకోసం ఎందరు జనం నిల్చున్నారో? బస్‌స్టాండ్ ప్రక్కగా 'ఫొటోస్టుడియో' వుంది. ఆ స్టుడియో గుమ్మంప్రక్కన గాజుపలక వెనకాల, పెద్ద కుటుంబంతాలూకు ఫొటో ఒకటి వుంది. అది చూచిన ముత్యాలు మనస్సుమీద, బూజుపట్టిన చిత్రాలు మెరిశాయి....తన భార్య, తన కొడుకు, తన కూతురు, తను— తాము నలుగురూవున్న ఫోటో ఒకటి, పాతది ఇప్పటికీ తన పెట్టె అడుగున వుంది....దానిని ఎప్పుడయినా బయటికి తీసి చూస్తుంటే, అది తన

కుటుంబమేనా—ఈ ఒంటరి ముదుసలికి కుటుంబం అంటూ వుండేదా—అని పిస్తుంది. ఎవరో గొప్ప అబద్ధంచెప్పి నమ్మమంటున్నట్లుంటుంది.

ముత్యాలు అన్నంగిన్నెను కుడిచేతికి మార్చుకున్నాడు. ఓనిముషం నడకఆపి బీడీని వెలిగించాడు.

"మరయితే ముత్యాలూ! నీకు కొడుకు లెవ్వరూ లేరా?" అని అడిగాడు నరసింహం ఇవ్వాళ పొద్దున! కొడుకు.... హు.... ఉన్నాడు.... ఉండేవాడు. ఇప్పుడులేడు. పొయ్యాడు. ఎక్కడికో పొయ్యాడు దుర్మార్గుడు.... వాడు, నారాయణ. పదహారేళ్ళు నిండకముందే తమ కడుపులో చిచ్చుపెట్టి పారిపోయాడు అసలు చిన్నప్పటినుండే చెప్పినమాట వినేవాడుకాదు.... దానికితోడు రత్నం—అదే వాళ్ళమ్మ—ఎప్పుడూ వాడిని వెనకేసుకు వచ్చేది. అదే వాడిని పాడుచేసింది. ఆరోజు ఇంట్లోవుంచిన డబ్బు తీసుకుని సినిమాకూ, ప్రక్కవూరి తిరణాలకూ వెళ్ళి, తిరిగి తిరిగి—పొద్దున్న వెళ్ళినవాడు అర్ధరాత్రప్పుడువచ్చాడు. తనకువిపరీతమయినకోపంవచ్చింది. కన్నూ ముక్కూ తెలియకుండా బాదేశాడు వాడిని. అంతే, పొద్దున్నలేచి చూస్తే ఇంట్లోలేడు వాడు! ఒక్కొక్కటిగా తన ఆశల ఆయుస్సు తీరిపోవడం ఆనాడు అరంభమయింది. ఆ చీకటిరోజుకు ఈ నాటికి పదేళ్ళ వయస్సుదాటింది. వాడు వెళ్ళిపోయిన ఏడాదిలోగా బెంగపెట్టుకుని మంచమెక్కింది రత్నం; మళ్ళీ దిగలేదు. వాడివల్లనేపోయింది తనరత్నం ... ఛీ.... వాడువున్నా చచ్చినా ఒక్కటే. తనకొడుకులేడు ........ ఎప్పుడూ లేడు.

ముత్యాలు చేతిలో బీడీ చురుక్కుమంది. పారేశాడుదాన్ని చింతల బస్తీలో అడుగుపెట్టాడు. ఆ మూడోవీధిచివర, మురికికాలవ కవతల తన గుడిసెవుంది. నెమ్మదిగా నడుస్తున్నాడు ముత్యాలు. తను తొందరగా వెళ్లాల్సిన అవసరం ఏముంది గనుక....తను రాలేదని అనుకునేవాళ్ళుంటేగా అందుకనే తాను డబ్బుఉన్నప్పుడు కూడా బస్సెక్కడు.

"ఏం తాతా" అని పలుకరించింది సుబ్బమ్మ; మూడోగుడిసెలో వున్న వీరయ్య పెళ్ళాం.

"ఎందాకానే–" అన్నాడు ముత్యాలు.

"అడికియ్యాల పైసలొచ్చిన్దిగద, జర్రంతకూర తెస్తామని" అని ముందుకు వెళ్ళింది సుబ్బమ్మ.

సుబ్బమ్మ కెంత, ఇరవై యేళ్ళుంటాయేమో ; తన కూతురు మంగమ్మకూడా ఈ వయసుదే. భార్య పోయింతర్వాత తన సర్వస్వమూ మంగమ్మగా మిగిలింది. ఆపాటికి ఆశలన్నీ ఉడిగిపోయాయి. అమ్మాయి గనక ఒక ఇంటిదయి పచ్చగావుంటే చాలనుకున్నాడు ముత్యాలు. ఆరి పోతున్న వత్తిని ఎగదోయజూచాడు ముత్యాలు. వెతికి వెతికి, ఏలూరు కలెక్టరాఫీసులో గుమాస్తా సంబంధం తీసుకొచ్చాడు. రెండువేలరూపా యలు అప్పుచేసి మంగమ్మకు పెళ్ళిచేశాడు. అమ్మాయి జీవితం ఒకదారిని పడింది. ఇంక ఈ అప్పుంది దానికి నెలకు ఇరవై రూపాయలు కట్టాలి. అదికూడా తీరిపోతే తానుక్షేకన్ను మూయవచ్చని మురిసిపోయాడు ముత్యాలు. కాని—

కాని ఆరునెలలు తిరక్కముందే—ఒకరోజు సాయంకాలం ఏలూరునుండి–మంగమ్మ చనిపోయిందని తంతివచ్చింది.

జీవచ్ఛవంగా ఏలూరు చేరుకున్నాడు ముత్యాలు. ఆపాటికి అన్నీ అయిపోయాయి. మీ అమ్మాయికి ఉన్నట్లుండి గుండెపోటువచ్చి పోయిం దన్నాడు అల్లుడు—ఏమో, తనకు నమ్మకం కుదరలేదు. కాని ఏం చెయ్యడం? తన బ్రతుకులో చివరి ఆశకూడా ఆరిపోయింది. క్షణకాలం – వాడివి, ఆ అల్లుడిని పొడిచి చంపేద్దామనిపించింది.

మరుక్షణం విపరీతమయిన నిర్లిప్తత, నిస్సహాయత ఆవరించాయి. ఎగదీసిన వత్తి దిగజారి పొగచూరిపోగా వెనక్కు—ఒంటరితనంలోకి,

దీపం వెలిగించిన చీకటిలోకి, యాంత్రికమయిన ప్యూను బ్రతుకులోకి, నెలకు ఇరవై రూపాయల అప్పులోకి—వచ్చాడు ముత్యాలు.

ఇప్పటికి నాల్గేళ్ళనుండి—రెండువేళల ఆఫీసుకూ, గుడిసెకూ మధ్య నడక. ఇంత వుడకేసుకు తినడం. నెలనెలా అప్పుతీర్చడం—ఏడుకొండలవాడిమీద భారంవేసి బ్రతకడం—ఇదీ కార్యక్రమం.

మురికి కాలవను దాటాడు ముత్యాలు.

తన గుడిసెను సమీపించాడు.

* * *

రెండు నెలల తర్వాత—

ఒక ఆదివారం సంజెవేళ—అస్తమిస్తున్న సూర్యుడు తన గుడిసెమీద కూడా ఇంత వెలుతురు పడేస్తుండగా—ముత్యాలు వాకిట్లో నులకమంచం మీద కూచునివున్నాడు.

యథాప్రకారం—చేతిలో బీడీ వెలుగుతున్నది: మనసులో ఆలోచనల వర్షం కురుస్తూంది. జరిగినవీ, జరిగివుంటే బాగుండుననుకున్నవీ, జ్ఞాపకాల పేటికలో అడుగున దాచుకున్నవీ, అక్కడక్కడ చెదిరిపోయినవీ—అన్నీ కలిసి ప్రవహించసాగాయి.

ఇంతలో సూర్యుడు విశమించాడు. ప్రపంచం చీకటి చీరను కట్టుకొని నక్షత్రాలను సిగలో తురుముకుంది. ముత్యాలు లోపలికివెళ్ళి వెంకటేశ్వరుడి పటంముందు దీపం వెలిగించి వచ్చి కూచున్నాడు. మళ్ళీ ఆలోచనల వర్షం.

కాని అయిదారు నిముషాల తర్వాత అతడివైపే వస్తున్న ఆకారం ముత్యాలు దృష్టి నాకర్షించింది. ఆలోచనలవర్షం ఆగింది. ఆ చోటుని ఆశ్చర్యం ఆక్రమించింది.

నెత్తిమీద ముసుగు, చేతిలో బిడ్డతో ఎవరో స్త్రీ వస్తున్నట్లు-కార్పొరేషనువారి దీపాల వెలుగు తెలుపుతూంది. తన్ను ఆమెకు చూపిస్తున్నాడు గురవయ్య కాటోలు.... ముత్యాలు లేచి నిల్చున్నాడు.

ఆ అమ్మాయి అతడి ఎదుటికి వచ్చి నిలుచుంది. సౌజన్యం నిండిన ఆమె మొహంమీది అలసటను, మసక వెలుతురు కప్పిపుచ్చలేకపోయింది. మాట్లాడకుండా, చిన్న సంచిలోనుండి ఒక నలిగిపోయిన కాగితంతీసి ముత్యాలు చేతికిచ్చింది ఆమె. ఆమె చేతిలోని బిడ్డ చుట్టుప్రక్కల చేరిన జనాన్ని వింతగా చూస్తున్నాడు.

ముత్యాలు ఆ కాగితాన్ని వీధి దీపం వెలుతురు పడేటట్లు, కంటికి కొస్తదూరంగా వుంచుకొని చూడసాగాడు. కొంత మౌనంగా చదివిన తర్వాత అప్రయత్నంగా అతడి కంఠం విప్పుకుంది.

"....అందుచేత, క్షమించమని అడగడానికి కూడా నేను తగను. తల్లితండ్రులు లేని లక్ష్మిని-తెనుగు మాటకూడారాని ఈ రాజస్థానీ యువతిని, నేను శాస్త్రోక్తంగా వివాహమాడాను. మాకు అబ్బాయిపుట్టి ఆరునెల లయింది.... భారతదేశపు సైనికుల్లో ఒకడుగా హిమాలయాల వైపుకు పోతున్న నాకు ఏదయినా ప్రమాదం జరిగితే లక్ష్మిని మీ దగ్గరకు పొమ్మని ఈ వుత్తరం వ్రాసిస్తున్నాను. దీని అవసరం ఎప్పుడొస్తుందో, ఏమో! కాని ఆ అవసరం వచ్చి లక్ష్మి మీ దగ్గరకొచ్చినప్పుడు మీరు, ఆమెనూ బిడ్డనూ కాదనరన్న నమ్మకం వుంది.... మీ కొడుకునని చెప్పుకోలేకపోతున్న-నారాయణ."

ఉత్తరం అయిపోయింది. ఉన్నట్లుండి నెత్తిమీద జలపాతం వర్షించినట్లు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు ముత్యాలు.

కళ్ళుతుడుచుకుని ఆమె అందిచ్చిన ఫొటోను గమనించాడు-వాడే నారాయణ! ఎంత పెరిగాడూ! వెధవ-పెద్ద మీసాలు కూడాను.... వాడి ప్రక్కన ఈ అమ్మాయే ....

అమ్మాయేమిటి అమ్మాయి, ఆమె తన కోడలు!

ముత్యాలు మనసు ఝల్లుమంది.

లక్ష్మివైపు చూశాడు. తల వంచుకుని నిలబడివుంది.

ఆమె తన కోడలు-తన కొడుకు పెళ్ళాం!

తన కొడుకు—అవును, తన కొడుకు! దేశంకోసం ప్రాణాలిచ్చిన వీరుడు తన కొడుకు!! ముత్యాలు హృదయంలో గర్వమూ సంతోషమూ పోటీపడ్డాయి. ఎడారిలో హిమనీనదం పరుగులెత్తింది.

"రామ్మా రా! లోపలికి రా.... ఆ వెధవాయివి ఇలా ఇయ్యి—" అని మనవడివి అందుకున్నాడు ముత్యాలు.

భాష వేరయినా, మాటలు స్పష్టంగా లేకపోయినా—ముత్యాలు కంఠంలోని ఆప్యాయత లక్ష్మికి అర్థమయింది.

ఆమె గుడిసె లోపలికి నడిచింది.

కొడిగట్టిన వత్తిని విదిలించి, ప్రమిదలో నూనె పోసింది.

( 'సైనిక సమాచార్' అగస్టు 63 )